

# మాతృత్వం

-యస్.ఘటికాచలరావు

"నిలువవే వాలు కను లదానా, వయ్యారి హంస నడక దానా... నీ నడకలో హొయలున్నవె చానా..." అంటూ నలుగురు ఆకతాయి విద్యార్థులు వెంటబడి గొడవ చేస్తున్నారు. ఈ సమస్య ఈనాటిది కాదు. తాను ఊరికి వచ్చిన దగ్గరనుండీ ఉంది.

మరీ సన్నగా పూచిక పుల్లలా కాకుండా, మరీ లావుగా గుండ్రాయిలా కాకుండా ఓ మోస్తరుగా చూపరులను ఇట్టే ఆకట్టుకునే ముఖ వర్చస్సుతో ఎంతో సొగసు అందంగా ఉంటుంది ఆమె. ఒక విధంగా చెప్పాలంటే ఆ కాలేజీలో ఎంతోమందికి ఆమె కలల రాణి. వర్ణింపనలవి కానిది ఆమె అందం. ఆమె కడగంటి చూపుకోసం ఎందరో నిరీక్షిస్తున్నారు.

ఇంటినుండి కాలేజీకి సుమారుగా ఒక కిలోమీటరు దూరం ఉంటుంది. రోజూ కాలి నడకనే ఆమె వెళుతూ ఉంటుంది.

"మన కాలేజీ కొత్త బ్యూటీ" అంటూ అందరూ చెవులు కొరుక్కున్నారు. కొందరు ఆమెకెదురుపడి పరిచయం చేసుకోవాలనుకున్నారు. మరి కొందరు ధైర్యంచేసి మాట్లాడారు. మరి కొందరు షేక్ హ్యాండ్ ఇచ్చేందుకు చేతులు చాపారు. ఇలా రకరకాలుగా ఆ దేవకన్యకు తమ ఉనికిని తెలియజేయడానికి శాయశక్తులా కృషిచేశారు.

అందరినీ చిరునవ్వుతో పలకరించింది కానీ ఎవ్వరికీ షేక్‌హ్యాండ్ ఇవ్వలేదు.

విరక్తి చెందిన కొందరు "ఒరేయ్! అది హ్యాండిచ్చే బాపతు గానీ షేక్ హ్యాండిచ్చే బాపతు కాదురా" అని కూడా అన్నారు అక్కసుతో చాటుమాటుగా. అవి ఆమె చెవిన పడకపోలేదు. కానీ ఆమె జాలిగా నవ్వుకుంది.

"ఒరేయ్ ఇది గమనించావా! ఆ బ్యూటీ క్వీన్‌కు పెళ్ళైనట్టుంది. కాలికి మెట్టెలు, మెడలో నల్లపూసల దండ చూడు."

"ఛఛ. పాలుగారే ఆ ముఖంలో పెళ్ళైన ఛాయలు ఎక్కడా కనబడలేదురా. ఇక మెట్టెలంటావా! ఈ కాలంలో అదో స్టైల్. ఇంకా చెప్పాలంటే ఇలాంటి వాటివల్ల ఎవరూ తమ జోలికి రారని వాళ్ళకున్న ఒక అపోహ. కానీ మనమేం తక్కువ తిన్నామా. ఎవరెలాంటి వాళ్ళో ఇట్టే చెప్పేయగలం" అలా రకరకాలుగా ఉన్నాయి ఆమె తోటి విద్యార్థుల విమర్శలు, విసుర్లు. దేనికీ ఆమె కలత చెంద లేదు.

ఆమె ఆ ఊరికి వచ్చి దాదాపుగా మూడు నెలలు కావస్తుంది. కాలేజీలో కొత్తగా చేరింది. సైన్స్ గ్రూప్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం చేరింది. వయసు సుమారుగా ఇరవై నాలుగేళ్ళున్నా అంత కనబడదు. అందరూ చదువు ముగించి ఉద్యోగాల వేటలో తలమునకలుగా ఉండే వయసులో ఆమె మాత్రం చదువు ప్రారంభించింది.

అందుకు కారణం ఆమె భర్త! అవును!! ఆమెకు పెళ్ళైంది. మూడేళ్ళ క్రితం పెళ్ళైంది. పెళ్ళికి ముందే భర్త ఆమెకు పెట్టిన నిబంధన ఆమె ఇంకా పై చదువులు చదవాలని.

కొన్ని కారణాలవల్ల వెంటనే చదువు కొనసాగించలేక పోయింది. ఇప్పుడు సమస్యలు సమసి భర్త కోరిక ప్రకారం మళ్ళీ కాలేజీ మెట్లెక్కింది.

ఎంత ఆకతాయి కుర్రాళ్ళైనా ఆమె హుందాతనంవల్ల ఎవరూ మితిమీరి అల్లరికి పూనుకోలేకపోయారు. కానీ ఆ నలుగురు మాత్రం ఇంకా తనను వెంటాడుతూనే ఉన్నారు. దేనికైనా కాలం కలిసి రావాలనుకుని ఆ సమయంకోసం ఆమె కూడా ఓర్పుతో వేచి చూడసాగింది.

వర్షాకాలం ప్రారంభమైంది. ఆ ఊరు తీరప్రాంతం కావడంవల్ల సహజంగానే సముద్రపు ప్రభావం కాస్తంత ఎక్కువగానే ఉంటుంది.

ఉదయాన్నే సన్నగా జల్లులు ప్రారంభమయ్యాయి. ఏడు గంటలకెల్లా భర్త ఆఫీసుకు వెళ్ళిపోతారు. ఆ తరువాత సుమారు తొమ్మిది గంటల ప్రాంతానికి చేతిలో ఒక చిన్న ఫోల్డింగ్ గొడుగుతో ఆమె కాలేజీకి బయలుదేరింది. ఇల్లు వదిలి సగం దూరం రాగానే గాలి ఉధృతమైంది. దానికితోడు వర్షపు చినుకులు కూడా పెద్దవయ్యాయి. ఆ చిన్న గొడుగు ఆమె తలను మాత్రమే వర్షంనుండి కాపాడగలిగింది. నడుము కింది భాగం మాత్రం కాస్సేపటికే వర్షంలో పూర్తిగా తడిసిపోయింది.

ఎక్కడి నుండి వచ్చారో ఆ నాలుగు రోడ్ల కూడలిలో హఠాత్తుగా ఆ నలుగురూ ఊడిపడ్డారు.

"తడిసీ నీ తెల్లకోక, తపా తపా మన్నది... తడబడి నా గడుసు మనసు దడదడామన్నది..." అంటూ వాళ్ళల్లో ఒకడు పాటందుకున్నాడు.

నిజంగా ఆ వర్షానికి చీర ఒంటికతుక్కుపోయి ఆమెకే చాలా ఇబ్బందిగా ఉంది. పైగా వాళ్ళ కామెంట్స్ ఆమెను మరింత ఇబ్బంది పెడుతున్నాయి. ఆమెకు సుమారుగా పదడుగుల దూరంలో అందరూ ఆమెతో సమానమైన వేగంతో నడుస్తున్నారు.

"ఒరేయ్! ఇంత వర్షంలో ఇప్పుడు కాలేజీకి పోకపోతే ఏంరా. వెచ్చగా కప్పుకుని పడుకుంటే ఎంత హాయిగా ఉంటుందో తెలుసా."

"దేన్ని కప్పుకుంటావు?"

"అందుబాటులో ఏదుంటే దాన్నే. దుప్పటైనా, దిండైనా లేదా దిండూ దుప్పట్లు లాంటిది మరేదైనా ఫరవాలేదు."

"అందుబాటులో ఉంటే అందుకోమరి."

"అంత సులభం కాదేమో."

ఆమె నడక వేగం పెంచింది. తత్సమానంగా వాళ్ళ నడక వేగమూ పెరిగింది. ఇంతలో వెనకనుంచి ఓ కారు రివ్వున వాళ్ళను దాటి వేగంగా ముందుకెళ్ళింది. రోడ్డుమీది బురద నీరంతా వాళ్ళ ముఖాన పడ్డాయి. ఆ కారు ఆమెను దాటి కాస్త దూరం వెళ్ళి మళ్ళీ వెనక్కు వచ్చి ఆమె పక్కనే ఆగింది.

ఆమె ఆ కారులో ఉన్న వ్యక్తితో కాస్సేపు ఏదో మాట్లాడింది. రెండు నిముషాల అనంతరం ఆమె వెనక తలుపు తీసుకుని కార్లో కూర్చోగానే కారు ముందుకురికింది. ఆ నలుగురూ ఆ సంఘటనకు అవాక్కైపోయారు. అర్థంకాక బుర్ర గోక్కున్నారు.

"అదేంట్రా. ఎవరీ కారు పార్టీ?"

"ఏమో"

"ఒరేయ్! దీనికి నిజంగానే పెళ్ళైందంటావా? ఒకవేళ కొంపదీసి వాడు దాని మొగుడేం కాదుగదా!"

"కావచ్చు కాకపోవచ్చు. ఐనా నేనానాడే అన్నాను. 'అది హ్యాండిచ్చే బాపతు గానీ షేక్ హ్యాండిచ్చే బాపతు

కాదురా" అని. నామాట ఎవరన్నా వింటేగా. ఇప్పుడిదిగో ప్రత్యక్ష సాక్ష్యం దొరికింది" అన్నాడు మరొకడు తన మాట నిజమైందన్నందుకు ఆనందంతో.

"సంతోషించాంలే. ఇకనేం! క్లాసుకు పద. అలాగైనా కాస్త టైంపాస్ అవుతుంది. అలాగే వాడెవడో ఆరా తీద్దాం."

వాళ్ళనుకున్నట్టుగానే ఆరోజు ఆమె గురించి కాలేజి ఆఫీసులో ఆరా తీశారు. దాదాపుగా ఆమె బయోడేటా మొత్తం రాబట్టారు.

"నిజంగానే పెళ్ళైందటరా!"

"ఐతేనేం. మనం ఎన్ని కథలు చదవలేదు, ఎన్ని సినిమాలు చూడలేదు. ఇలాంటి వాళ్ళకు కొన్ని సమయాల్లో సైడ్ ట్రాక్‌లు ఉంటాయి. ఒకవేళ ఇప్పటిదాకా లేదనుకో. ఇకముందు ఆ ట్రాక్ మనమే వేద్దాం. అందులోనూ పెళ్ళైన వాళ్ళంటే అనుభవం ఇంకా ఎక్కువగానే ఉంటుంది. మనకే ఇంకా నేర్పుతారు."

"మాటలు కట్టిపెట్టి ముందుగా లైన్లోకి లాగే మార్గం చూడు."

"దేనికీ తొందర పడగూడదు. నిదానమే ప్రధానం అన్నారు పెద్దలు"

"ఆ పెద్దలే ఆలస్యం అమృతం విషం అని కూడా అన్నారు."

"సో... దీనర్థం ఏమిటంటే... ఆ అమృతం చేతికొచ్చేంత వరకూ నిదానించాలి. వచ్చిన తరువాత ఏమాత్రం ఆలస్యం చేయగూడదు. తెలిసిందా! దేనికైనా అనెలిటికల్ థింకింగ్ ఈజ్ మస్ట్. గుర్తుంచుకోండి."

"ఒరేయ్. నువ్వు నిజంగా కన్యాశుల్కం గిరీశాన్ని మించి పోతావురా."

⁂ ⁂ ⁂

'బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత ఉధృతమై ఈ సాయంత్రానికి కోస్తా తీరాన్ని దాటవచ్చు. దీని ప్రభావంవల్ల రాగల ఇరవై నాలుగ్గంటల్లో కోస్తా అంతటా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.'

వార్తల్లో చెప్పకముందే వాతావరణం వర్షాన్ని సూచించింది. అది వాయుగుండమని మాత్రం అప్పుడు తెలిసింది.

ఆరోజు శనివారం. మధ్యాహ్నంవరకే కాలేజి. కాలేజీ లైబ్రరీలో కాస్త ఆలస్యమైనందువల్ల ఒంటిగంటకు బయలుదేరవలసింది ఒక గంట ఆలస్యమైంది. వర్షం ఇంకా ప్రారంభం కాలేదుగానీ గాలి మాత్రం ఓ మోస్తరుగా వీస్తూంది. వర్ష సూచనలు ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి. దాన్ని దృష్టిలో ఉంచుకుని ఆమె గబగబా అడుగులు వేయసాగింది.

సరిగ్గా నాలుగు రోడ్ల కూడలి వద్దకు రాగానే వర్షం ప్రారంభమైంది. అదీ ఒకేసారి ఉధృతంగా! తనకు సుమారుగా వంద అడుగుల దూరంలో బస్టాప్ ఉంది. కనీసం అక్కడివరకైనా వర్షం రాకుండా ఉంటే బాగుణ్ణు. చేతిలోని గొడుగు ఎండకే గానీ వానకు గాదు.

గాలి వేగం అంతకంతకూ ఉధృతం అవుతూంది. ఆకాశం నిండా నల్లని మేఘాలు ఇప్పుడో అప్పుడో కుండపోతగా వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయి. గాలి వేగానికి హఠాత్తుగా చేతిలోని గొడుగు వెనక్కు విరుచుకుని దాదాపుగా విరిగిపోయింది. ఆ మరుక్షణం వర్షం ప్రారంభమైంది. అదీ ఒకేసారి తీవ్రరూపం దాల్చింది. రాళ్ళు రువ్వినట్టుగా ఉన్నదా వేగం. వర్షంనుంచి కాపాడవలసిన గొడుగే వర్షానికి బలైంది. క్షణాల్లో ఆమె తడిసి ముద్దైంది. పల్చని చీర ఒంటికి అతుక్కుపోయి అందాలన్నీ బహిర్గతం చేయసాగింది.

అదే క్షణంలో ఆ నలుగురూ ప్రత్యక్షమయ్యారు.

"వారెవ్వా! క్యా సీన్ హై!!" అంటూ ఒకడు అరిచాడు.

ఆ వెంటనే మరొకడు పాటందుకున్నాడు "భోళీకే పీఛే క్యాహై... భోళీకే పీఛే..." అంటూ.

"సుందర సుమధుర మనోహర దృశ్యం. దేనికైనా పెట్టి పుట్టాలి. ఆ భర్తగాడెంత అదృష్టవంతుడురా. పెళ్ళైనా ఇంకా తరగని ఆ బిగువులు! ఇంకా పిల్లలు లేరేమో! మొత్తానికి ఫిగర్ బాగానే మెయిన్‌టెయిన్ చేస్తున్నాడు."

వాళ్ళు నలుగురూ ఆ వర్షంలో హాయిగా తడుస్తూ ఆహ్లాదకరంగా ఆమె అందాలను చూసి ఆనందిస్తున్నారు.

కష్టపడి గొడుగును ఎదురుగాలికి పట్టి సరిచేసుకుని గబగబా బస్టాప్ వైపునకు పరుగుతీసింది. ఆమె వెనకనే ఆ నలుగురు కూడా బస్టాప్ వైపునకు పరుగుతీశారు.



నేల మీద ఒకామె అపస్మారక స్థితిలో పడిపోయి ఉంది. బహుశా ఎవరో బిచ్చగత్తె కావచ్చు. ఆకలికి తాళలేక సొమ్మసిల్లి పడిపోయి ఉండవచ్చు. ఆమె కూడా మొత్తం తడిసిపోయింది. దాదాపు అస్తిపంజరం లాంటి దేహం! ఆమె పైన పడి ఒక పసి కందు, దాదాపుగా మూడునాలుగు నెలల పసికూన, ఏకబిగిన ఏడుస్తూంది. బిడ్డ బొద్దుగా ఉంది.

ఆ వంద అడుగులూ వెళ్ళేసరికే ఆమె ఆపాదమస్తకం తడిసిపోయి కురుల మీద నుండి నీరు ధారగా కారసాగింది.

గొడుగు అంతంత మాత్రంగానే బాగైంది. కానీ నిరుపయోగంగా మారింది. మరో పది నిముషాలు చూసి వర్షం తగ్గకపోతే అలాగే తడుస్తూ ఇంటికెళ్ళాలన్న నిర్ణయానికి వచ్చేసింది.

ఆ నలుగురి మాటలు ఇబ్బందికరంగా ఉన్నాయి. చూపులు ఇంకా ఇబ్బందిగా ఉన్నాయి. ఇందాకటి పాటనే పదే పదే పాడుతున్నాడా స్టూడెంట్. అప్పటికీ రెండుమూడు సార్లు చీదరించుకుంది. ఐనా అదేమీ పట్టనట్టు వాళ్ళు తమ మానాన తమ పని కానిస్తున్నారు.

'రెండురోజుల క్రితం అనుకోకుండా వచ్చినట్టే తన భర్త మళ్ళీ ఇప్పుడు వస్తే బాగుణ్ణు' అనుకుంది కానీ అలా జరగలేదు. ఆరోజు ఏవో కొన్ని కాగితాలు ఇంట్లో మర్చిపోయినందువల్ల మళ్ళీ తిరిగి ఇంటికి వచ్చి వెళ్తూ దారిలో ఆమెను చూసి పికప్ చేసుకుని కాలేజి వద్ద దింపాడు. కానీ రోజూ అలా జరగదు గదా! అందులోనూ ఇది కాలేజినుండి ఇంటికి వెళ్ళే సమయం. ఆయన ఆఫీసు వదిలి సాయంత్రం ఆరింటికి గానీ రారు. వర్షం తగ్గేదాకా ఆగాలంటే ఇప్పట్లో తగ్గే సూచనలు కనబడలేదు.

బస్టాప్‌లో జనం ఎవ్వరూ లేరు ఆమె ఆ నలుగురూ తప్ప! అంతటి వాన హోరులో కూడా దూరంగా ఎక్కడో ఘంటసాల పాట వినబడుతూంది...

'దీనులను కాపాడుటకు దేవుడే ఉన్నాడు... దేవుని నమ్మినవాడు ఎన్నడూ చెడిపోడూ...'

ఇంతలో ఎక్కడో పసికందు ఏడుపు వినిపించింది ఆమెకు. చుట్టుపక్కల పరికించి చూడగా బస్‌షెల్టరు వెనక భాగంలో నేల మీద ఒకామె అపస్మారక స్థితిలో పడిపోయి ఉంది. బహుశా ఎవరో బిచ్చగత్తె కావచ్చు. ఆకలికి తాళలేక సొమ్మసిల్లి పడిపోయి ఉండవచ్చు. ఆమె కూడా మొత్తం తడిసిపోయింది. దాదాపు అస్తిపంజరం లాంటి దేహం! ఆమె పైన పడి ఒక పసి కందు, దాదాపుగా మూడునాలుగు నెలల పసికూన, ఏకబిగిన ఏడుస్తూంది. బిడ్డ బొద్దుగా ఉంది.

పరిస్థితేమిటో ఆమెకు అర్థంకాలేదు. ఆమె ఎవరు? ఆ బిడ్డ నిజంగా ఆమె బిడ్డేనా, లేకుంటే ఎవరి బిడ్డనైనా దొంగిలించుకుని వచ్చిందా? బిడ్డకూ తల్లికీ పోలికలే లేవు. ఐతే అంతకంతకూ ఆ బిడ్డ ఏడుపు శృతిమించ సాగింది. ఆ బిచ్చగత్తె లేచే స్థితిలో లేనే లేదు.

ఆమె బిచ్చగత్తెను లేపే ప్రయత్నం చేద్దామనుకుని అంతలోనే విరమించుకుంది. చేతిలోని విరిగిన గొడుగును పక్కనబెట్టి రెండడుగులు వెనక్కువేసి ఆ బిడ్డను తన రెండు చేతుల్లోకి తీసుకుని పొదివి పట్టుకుంది.

కాస్సేపు లాలించి బుజ్జగించి చూసింది. కానీ ఏడుపు మానే స్థితి కానరాలేదు. ఆకలిగా ఉందేమో, ఇప్పుడెలా?

రెండు క్షణాలు ఆలోచించిందామె. రెండే క్షణాలు!

వెంటనే ఆ బస్సు షెల్టరులో ఉన్న తిన్నె మీద కూర్చుని ఆ బిడ్డకు పాలివ్వడానికి సిద్ధమైంది. ఆ క్షణంలో ఆమెకు ఆమె కళ్ళ ముందు ఇంట్లోని తన ఆరు నెలల పసికందు మాత్రమే దృష్టిలో నిలిచింది. తన బిడ్డకే ఆకలేసిందేమో అన్నంత ఆతృత ఆమె కళ్ళలో కనబడింది. ఆ బిడ్డను అక్కున చేర్చుకుని పమిటను పూర్తిగా కప్పుకుని పాలివ్వసాగింది.

అప్పటివరకూ ఇంకా ఆమెను టీజ్ చేస్తున్న ఆ నలుగురూ ఆ క్షణమే స్తంభించి పోయారు ఆమె ప్రవర్తనకు. 'అంటే ఆమె తప్పకుండా ఒక బిడ్డ తల్లై ఉండాలి. అదీ ఒక పసికందు ఇప్పుడామె ఇంట్లో ఉండి తీరాలి. లేకుంటే ఈ పని అసాధ్యం!' అనుకున్నారు.

సుమారు పది నిముషాల తరువాత ఆమె ఆ పసికందుకు పాలివ్వడం ఆపింది. ఆ బిచ్చగత్తెను షెల్టరులోనికి లాగి ఇక గత్యంతరం లేక బిడ్డను పక్కనే నేలమీద పడుకోబెట్టింది. ఇప్పుడా పసికందు ఉల్లాసంగా కేరింతలు కొడుతూ ఆడుకుంటూ ఉంది. వర్షం ఇంకా పడుతూ ఉన్నా ఆ పసికందు మీద మాత్రం పడడంలేదు.

ఆ బిడ్డవంక తృప్తిగా చూసి అరవిరిసిన చిరునవ్వుతో ఇటువైపునకు తిరిగి చూసి విస్మయం చెందింది.

తనను అల్లరి పెడుతున్న ఆ నలుగురూ ఆమె పాదాల చెంద మోకాళ్ళ మీద నిలబడి చేతులు జోడించి ఉన్నారు.

ఆమె విప్పారిన నేత్రాలతో వాళ్ళవంక చూసింది.

"క్షమించండి మేడం. మానవత్వం అంతకు మించిన మాతృత్వం కూడా ఆ రవిక వెనక ఉంటాయని ఇప్పుడే తెలుసుకున్నాం. ఇంకెప్పుడూ మీ కంటికి కనబడం" అంటూ ఆ కుండపోత వర్షంలోనే నిదానంగా నిర్లక్ష్యంగా తడుస్తూ దూరంగా వెళ్ళిపోయారు ఆ నలుగురూ.

జరిగినదాన్ని తలుచుకుంటూ ఆమె కూడా తృప్తిగా నిట్టూరుస్తూ ఆహ్లాదకరంగా నవ్వుకుంది. ఒకమారు ఆ పసికందు వైపు ఎంతో అభిమానంగా ఆరాధనాభావంతో చూసింది. పసి పిల్లలు దైవ సమానులంటారు ఇందుకేనేమో అనుకుంది. అనుకోకుండానే తన సమస్య తీరిపోయినందుకు తన మనసులోనే ఆమె పసికందుకు కృతజ్ఞతలు చెప్పుకుంది. ★